కుక్కలున్నాయ్... పిక్కలు జాగ్రత్త

- గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- వృద్ధులు, పిల్లలపై దాడులు
- రోజురోజుకూ పెరుగుతున్న కుక్కల బాధితుల సంఖ్య
- పట్టించుకోని అధికారులు


కొండెవరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహనదారులు, పాదచారులను వెంబడించి కరుస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై దాడి చేయడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

నెలకు 700 కేసులు

మండలంలోని కొత్తపల్లి, నాగులాపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకు సుమారు 600–700 కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులను కుక్కలు పరుగెత్తించి పిక్కలు లాగేస్తున్నాయి. ప్రధాన కూడళ్లు, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలకుండా తరిమితరిమి కరుస్తున్నాయి. కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాదు, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

కుక్కకాటుతో ఇటీవల వ్యక్తి మృతి

మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన గంటా బానయ్య కుక్కకాటుతో ఇటీవల మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అదే రోజు బానయ్యను గాయపరిచిన కుక్క మరో 15 మందిని గాయపరచడంతో బాధితులు కొత్తపల్లి ఆరోగ్యకేంద్రం వైద్యులను ఆశ్రయించారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రతిరోజూ సుమారు 10 మందికి పైగా కుక్కకాటుకు గురవుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రిపగలు తేడా లేకుండా కుక్కలు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలి.

– యర్రా శ్రీనివాసరావు, కొత్తపల్లి


కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుక్కకాటు బాధితులు


అమినాబాదులో కుక్కకాటుకు గురై గాయపడిన బాలిక

గీతా మందిరాన్ని అభివృద్ధి చేయాలని వినతి


గోకివాడలో సమస్యను ఎమ్మెల్యే దొరబాబుకు వివరిస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కొత్తపేట కాలనీలోని గీతా మందిరాన్ని అభివృద్ధి చేయాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం పిఠాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబును మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. గీతా మందిరం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సమస్యను పరిష్కరించండి

పిఠాపురం మండలం గోకివాడలో డ్రైన్ ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే దొరబాబును కోరారు. రెవెన్యూ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించ డానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలను చేసి దర్శించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు తెలిపారు.

కౌన్సిల్ సాధారణ సమావేశం వాయిదా


సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ కోరమ్ లేక పోవడంతో మొదటిసారిగా సాధారణ సమావేశం వాయిదా పడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావలసి ఉంది. చైర్‌పర్సన్‌తో కలిసి 31 మంది సభ్యులు ఉండగా అధికార పార్టీకి చెందిన రెండో వైస్‌చైర్‌పర్సన్ గొకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, మిరియాల మేరీ మాత్రమే హాజరయ్యారు. ప్రతిపక్షానికి చెందిన సభ్యులు ఇద్దరు కూడా హాజరు కాలేదు. సుమారు 30 నిమిషాలపాటు వేసి ఉన్నా సభ్యులు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ అరుణ ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డీఈ హుస్సేన్, మేనేజరు అచ్యుతరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు కూలీల ధర్నా


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో సీలింగ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు దోమ్మెటి సురేష్ హెచ్చరించారు. రైతుకూలీలతో కలిసి సోమవారం ఆయన ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలన్నారు. పెత్తందారులకు మద్దతు నిలుస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని, ఈ వ్యవహారంపై ఆర్డీఓ విచారణ జరపాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేదులూరి లక్ష్మి, నారాయణమూర్తి, వెంకటరమణ, ఏసురత్నం, చిన్ని, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు, తదితరులు

సామర్లకోట: తాము చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలన్న సంకల్పంతో బై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వీకే రాయపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివ రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్ని పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జైభీమ్ యువజన సేవా సంఘ సభ్యులు సీహెచ చంటిబాబు, జమేశ్వరరావు, అరవింద్, నవీన్, మధుబాబు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట: వేట్లపాలెం గ్రామ శివారు కందదోడిలోని డ్రైన్ల నిర్మాణానికి సోమవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. రూ.18 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా డ్రైన్లను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గ్రామ పార్టీ నాయకులు పాలచర్ల సాయిబాబు, గోలి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

- అధికారులను ఆదేశించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్
- 38, 39 అంశాలను వాయిదా వేస్తూ కౌన్సిల్ తీర్మానం
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు


చైర్‌పర్సన్ మంగతాయారు

పెద్దాపురం: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కౌన్సిల్ సూచించింది. పెద్దాపురం పురపాలక సంఘ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, అధికారులు మంచినీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు చేయించాలని కమిషనర్ సురేంద్రకు సూచించారు. అనంతరం నిర్వహించిన జీరో అవర్‌లో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా మాట్లాడుతూ మున్సిపల్ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన 38, 39 అంశాలను వాయిదా వేయాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు స్పందిస్తూ ఆ అంశాలను వాయిదా వేస్తూ తీర్మానించారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేయడంతో సరైన పద్ధతి పాటించడం లేదని, అంచనాలు, ప్రతిపాదనల్లో లెక్కలు తప్పుతున్నాయని, అధికారులు మరింత అప్రమత్తంగా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. కౌన్సిలర్ దుర్గారావు మాట్లాడుతూ మా వార్డులో డ్రైన్ నిర్మాణం ఎందుకు చేపట్టలేదని అధికారులను నిలదీశారు. సత్వరమే డ్రైన్ నిర్మించాలని కౌన్సిల్ ఆదేశించింది. కౌన్సిలర్లు తాటికొండ వెంకటలక్ష్మి, గుర్రాల మార్త మాట్లాడుతూ మా వార్డుల్లో మేజర్ డ్రైన్, రోడ్లు నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు, డ్రెయిన్‌లపై చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఉమామహేశ్వరరావు, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై గరంగరం

- పారిశుధ్య నిర్వహణపై కౌన్సిలర్లు అసంతృప్తి
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ కౌన్సిలర్లు అధికారులపై మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, డ్రైన్లు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిలిచిపోతోందని, రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోరా అని అధికారులను నిలదీశారు. నాన్ లేవుట్‌లపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై కౌన్సిలర్లు మండిపడ్డారు. పట్టణంలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలకు సమాధానం చెప్పలేక రాజీనామా చేసే పరిస్థితి ఏర్పడిందని కౌన్సిలర్ పెదపాటి రాజేష్ అన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సూర్యావతి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 11 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 11 అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణంలో మధ్యాహ్నం భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని, మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై 11 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారాని కోసం ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దవులూరి దొరబాబు
- పి.వేమవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పి. వేమవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం సాయంత్రం పి.వేమవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎలిశెట్టి నరేష్, మాజీ సర్పంచ్ మునిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొరలతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో పజల వద్దకే పరిపాలన తీసువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మళ్లీ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలబడాలని దవులూరి దొరబాబు కోరారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, అచ్చంపేట సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పితాని కృష్ణ, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి


గోర్సలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సుబ్బారావు

కొత్తపల్లి: ఓటర్ల సర్వేలో అర్హులైన వారికి గుర్తించి వారందరికీ ఓటు హక్కును కల్పించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారావు బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని గోర్సలో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టు, ఓటరు ఐడీ కార్డులో ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాన్నారు. ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లు కలిగి ఉంటే వారి అభిప్రాయాల మేరకు ఒక చోట ఉంచి మిగిలిన చోట్ల ఓటు తీసివేయాలని సూచించారు. సర్వేపై బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ రెవెన్యూ అధికారి జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులతో మమేకం కావాలి

డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

కొత్తపల్లి: ప్రజలు పోలీసులతో మమేకం కావాలని, పోలీసులంటే భయం వీడి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని కొత్తపేట రామాలయం వద్ద సోమవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మహిళల భద్రత, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకు వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో కాకినాడ జిల్లాలో గతేడాది 175 మంది మృతి చెందారని తెలిపారు. మద్యం తాగి డ్రైవ్ చేయడం, అతి వేగమే ఈ ప్రమాదాలకు కారణమన్నారు. మహిళల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రతి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులను నియమించిందని చెప్పారు. సైబర్ నేరాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువ కేంద్రాలతో రైతులకు మేలు


చేబ్రోలులో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

పిఠాపురం: పాడి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జెడ్పీ సీఈఓ రమణారెడ్డి అన్నారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని జగనన్న పాలవెల్లువ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కేంద్రాలకు అందించిన సామగ్రి, పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కేంద్రాల ద్వారా 160 లీటర్ల పాలను సేకరిస్తారన్నారు. పాలవెల్లువకు సంబంధించి ఏర్పాటు చేసిన గ్రామస్థాయి కార్యదర్శులు రైతుల వద్దకు వెళ్లి వారి పాడి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శర్మ, ఈఓపీఆర్డీ విద్యాసాగర్‌కుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

గండేపల్లి: మండలంలోని మురారి, గండేపల్లి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వై.సునీత, వి.సుజాత తదితరులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మండలంలోని వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే 60 శాతం నాట్లు పూర్తయ్యాయని, ఈనెలాఖరుకు 100 శాతం పూర్తి అవుతాయన్నారు. ఇప్పటి వరకూ వేసిన వరినాట్లుకు చీడపీడలు, పోషక సమస్యలు లేవని ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల ఆకుముడత తెగులు కనిపిస్తోందన్నారు. దాని నివారణకు లీటరు నీటిలో కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పి.సదుర్గ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: వరి సాగులో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం గ్రామాల్లో సోమవారం డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, డాక్టర్ వై.సునీత, డాక్టర్ సుజాతలతో కూడిన సైంటిస్టుల బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో వరి నాట్లతో పాటు వివిధ పంటలను పరిశీలించారు. వరి నారుమడులు ఆరోగ్యంగా ఉన్నాయని, ఎక్కడా చీడపీడలు కనిపించలేదన్నారు. రైతులు అవసరం మేర మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ నరసింహం, రైతులు పాల్గొన్నారు.

వేట్లపాలెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సామర్లకోట: మేజరు పంచాయతీ అయిన వేట్లపాలెం సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసిన్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం తెలిపారు. వేట్లపాలెం పంచాయతీలో మాజీ సర్పంచ్‌తో పాటు ప్రస్తుత సర్పంచ్ సీహెచ్ వెంకటలక్ష్మి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం దీనిపై డీఎల్‌పీఓ విచారణ చేసిన విషయం విదితమే. ఈ మేరకు డీఎల్‌పీఓ ఇటీవల సామర్లకోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. దాంతో జిల్లా ఉన్నతాధికారులు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసి ఇన్‌చార్జిగా ఎంపీడీఓ డి.శ్రీలలితకు చెక్ పవర్ బాధ్యతలు అప్పగించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కొత్తపల్లి: సచివాలయాలకు వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈఓపీఆర్డీ భాస్కరరావు సూచించారు. మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ముసలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరిపై చురుగ్గా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

అన్నవరం: స్థానిక రత్నగిరి వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్న 33 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 కల్లా ఈ సబ్‌స్టేషన్ నుంచి దేవస్థానానికి విద్యుత్ సరఫరా చేయాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) డైరెక్టర్ సూర్య ప్రతాప్ ఇటీవల అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. కొండ దిగువన 33 కేవీ విద్యుత్ లైన్ నుంచి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు గాను 60 అడుగుల ఎత్తులో 12 టవర్లు నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ట్రాన్స్‌కో విశ్రాంత డీఈ జి.రాంబాబు తెలిపారు.